క్లుప్తంగా

సామాజిక సేవ అవసరం



నూతన వస్త్రాలు అందజేస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

నాగులుప్పలపాడు: పేదల అవసరాలు తీర్చడంతో పాటు సమాజానికి ఉపయోగపడే అంశాల్లో క్లబ్ తరఫున ముందుంటామని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్ బాబు అన్నారు. వాసవి క్లబ్ సభ్యుల పుట్టిన రోజు సందర్భంగా గురువారం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు, వారి పిల్లలకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యకర్త శామ్యూల్ మాట్లాడుతూ పేదల అవసరాలు తీర్చడంలో వాసవి క్లబ్ సేవలు అమోఘమన్నారు. జలంధర్, కొలకలూరి రత్నాకర్, అమరా వేణు, సుధాకర్, రాజేష్, బెల్లం శ్రీను ఉన్నారు.

డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్‌గా ధర్మేంద్ర బాబు

ఒంగోలు టౌన్: స్థానిక డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్.ధర్మేంద్ర బాబును నియమిస్తూ ఎస్పీ మలిక గర్గ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు పోస్టింగ్ ఇచ్చిన కాకుమాను వెంకటరావును గుంటూరు రేంజ్ వీఆర్‌కు పంపించారు.

పొగాకు అమ్మకాలు

ఒంగోలు రూరల్: పొగాకు వేలం కేంద్రం–2కి 520 బేళ్లు రాగా 493 బేళ్ళ కొనుగోళ్లు జరిగాయి. 7 బేళ్లు నోబిడ్ అయ్యాయి. గరిష్ట ధర రూ.245 పలుకగా, కనిష్ట ధర రూ.164, సరాసరి ధర రూ.235.94 గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి కె.రామకృష్ణ తెలిపారు.

'పొన్నూరు'కు వేద విజ్ఞాన వేదిక ఆహ్వానం



పొన్నూరు శ్రీనివాసులు (ఫైల్)

ఒంగోలు టౌన్: చెన్నైకు చెందిన వేద విజ్ఞాన వేదిక నిర్వహించే సదస్సుకు ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులుకు ఆహ్వానం అందినట్లు గురువారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ఆదివారం సాయంత్రం చెన్నైలోని ఆంధ్ర క్లబ్ జరిగే సదస్సులో శ్రీ కాళహస్తీశ్వర మహత్యం–ధూర్జటి కవితా మాధుర్యం అనే అంశం మీద ప్రసంగించనున్నట్లు తెలిపారు. కాగా పొన్నూరుకు ఆహ్వానం పట్ల ప్రరసం కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, కోశాధికారి కె.వి.రమణారెడ్డి, సభ్యులు అన్నువిజయకుమారి, పాలూరి శివప్రసాద్, కె.ఎస్.వి.ప్రసాద్, వడలి రాధాకృష్ణ, ప్రముఖ గాయకులు ఐ.మురళీకృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన అంజయ్య

నాగులుప్పలపాడు: అతి వేగంగా మోటారు సైకిల్ నడుపుతున్న వ్యక్తి.. మరో మోటార్ సైకిల్ ను ఢీకొన్న ఘటనలో ఎదురు ఉన్న వ్యక్తి తీవ్ర గాయాలైన ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. కృష్ణంరాజువారి పాలెంకు చెందిన అంజయ్య తన టీవీఎస్ ఎక్సెల్‌పై ఒమ్మెవరం రోడ్డుకు మలుపు తిప్పే క్రమంలో ఇంకొల్లు నుంచి నాగులుప్పలపాడుకు మోటారు సైకిల్ పై వెళ్తున్న యువకుడు అతి వేగంగా వచ్చి టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొనడంతో అంజయ్య కాలికి తీవ్రంగా గాయమైంది. 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

చిన్నారుల వికాసమే అంగన్‌వాడీల లక్ష్యం

నాగులుప్పలపాడు: చిన్నారులు, కిశోర యువతుల వికాసమే అంగన్‌వాడీలు లక్ష్యంగా పనిచేయాలని మద్దిపాడు సెక్టార్ సీడీపీఓ ఇవాంజలిన్ అన్నారు. మండల కేంద్రం నాగులుప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కిశోర బాలికల అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కిశోర బాలికల్లో వచ్చే రక్తహీనత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిన్నారుల మనో వికాసానికి దోహదపడే అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. డీసీ కిరణ్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎయిడెడ్ సమస్యలపై ఏడీకి వినతి

ఒంగోలు: ఎయిడెడ్ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యల పరిష్కారాన్ని కోరుతూ విద్యాశాఖ ఏడీ ఉదయభాస్కర్‌కు ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి గురువారం వినతిపత్రం అందించారు. పాఠశాలల్లో మంచినీటి సౌకర్యం కల్పన, గుర్తింపులేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను ప్రభుత్వంలో విలీనం చేయడం, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తూ మరణించిన కుటుంబ సభ్యుల వివరాలను విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపించాలన్నారు.

'జగనన్న సురక్ష' విజయవంతం చేయండి



ఉలిచిలో మాట్లాడుతున్న ఎంపీడీవో అజిత

ఒంగోలు రూరల్: గత నాలుగేళ్ళుగా ప్రభుత్వం చేపట్టిన పథకాలు పొందలేని వారి జాబితాను రూపొందించి జూలై 1 నుంచి వారి వారి గ్రామాల్లో పథకాలు అమలు చేయడమే జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రధాన ఉద్దేశమని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత అన్నారు. గుండాయపాలెం, దేవరంపాడు, ఉలిచి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు సంయుక్తంగా నిర్వహించారు. గుండాయపాలెంలో రేవు సౌజన్య, ఉలిచిలో మురళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత మాట్లాడుతూ అర్హులై ఉండి పథకాలు లబ్ధి పొందలేనివారు 11 ఆన్‌లైన్ సర్వీసులు పొందనివారి సమాచారాన్ని సర్వే ద్వారా నిర్దిష్టంగా ఆయా వలంటీర్లు ప్రణాళిక ప్రకారం చేయలన్నారు. ఆన్‌లైన్ సర్వీసు చేసే సమయంలో సపోర్టింగ్ డ్యాకుమెంట్లు తీసుకున్నప్పుడు తప్పనిసరిగా ఏయే డ్యాకుమెంట్లు తీసుకుంది, నమోదు చేసినట్లు లబ్ధిదారులకు రశీదు ఇవ్వాలని తెలిపారు. తొలుత ఆయా గ్రామాల్లో ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ సర్వే నిర్వహించే విధానం గురించి వివరించారు.

ముక్తినూతలపాడులో..

రూరల్ వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాయపాటి అంకయ్య ఆధ్వర్యంలో ముక్తినూతలపాడులో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేవారు. రాయపాటి అంకయ్య మాట్లాడుతూ జగనన్న సురక్షా పథకం సచివాలయ సిబ్బంది పనితీరుకు, వలంటీర్ల చేసిన సేవలకు పొలమానం వంటిందన్నారు. ఈ సర్వే అయిన తరువాత తాము పథకాలకు అర్హులై ఉండి పొందలేకపోయామన్ని భావన, ఆరోపణ ఏ ఒక్కరి నుంచి రాకూడదని ఆ విధంగా సర్వే నిర్వహించాలని సూచించారు. కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకం వీక్షణకు ఏర్పాట్లు

నాగులుప్పలపాడు: నవరత్నాల అమలుతో పాటు, లబ్ధిదారుల పరిశీలన కోసం ముఖ్యమంత్రి చేపట్టిన జగనన్న సురక్ష పథకం ప్రారంభం సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆ కార్యక్రమ వీక్షణ కోసం ప్రజలకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో జయమణి తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు.

జగనన్న సురక్ష పథకం షెడ్యూల్

జూలై 1 నుంచి అన్ని గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష అవగాహన కార్యమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చెప్పారు. దీని కోసం ఎంపీడీవో, తహసీల్దార్లను రెండు టీంలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1 న అమ్మనబ్రోలు1, 2., 3న చదలవాడ, చీర్వానుప్పలపాడు, 5న ఈదుమూడి, నిడమానూరు, 7న కండ్లగుంట, కనపర్తి–1, 10న కనపర్తి–2, కొత్తకోట, 12న మాచవరం, మద్దిరాలపాడు, 14న ఎం.ముప్పాళ్ళ, నాగులుప్పలపాడు, 17న పోతవరం, రాపర్ల, 19న తిమ్మసముద్రం –1,2, 21వ తేదీన ఉప్పుగుండూరు–1,2 సచివాలయాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సచివాలయాలను సందర్శించిన జెడ్పీ చైర్‌పర్సన్



సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ గురువారం ఆకస్మికంగా చీమకుర్తి మున్సిపాలిటీలోని 1, 5 సచివాలయాలను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పనితీరు, సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. హాజరు వివరాలను తెలుసుకున్నారు. ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై సంక్షేమ పథకాలను పొందన లబ్ధిదారులను గుర్తించి వారి సమస్యలను ఏ విధంగా పరిష్కరించనున్నారో తెలుసుకున్నారు. కమిషనర్ షేక్ ఫజులుల్లా, తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతో అభివృద్ధి సాధ్యం



విద్యార్థులకు బహుమతులు అంజేస్తున్న మేనేజర్ సురేష్, సుబ్బారావు

కొత్తపట్నం: గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్థిక అక్షరాస్యత సాధించడానికి ఆర్‌బీఐ అన్ని విధాలా కృషి చేస్తోందని కొత్తపట్నం కెనరా బ్యాంక్ మేనేజర్ సురేష్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలో 7 హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. మోటుమాల, అల్లూరు, గమళ్ళపాలెం, ఆలూరు, ఈతముక్కల, కొత్తపట్నం, కేజీబీవీలో చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి ఆలూరు హైస్కూల్ విద్యార్థులు సీహెచ్ పవన్, ఏ.శృతికు ప్రథమ బహుమతి రూ.5 వేలు నగదు, ఈతముక్కల హైస్కూల్ విద్యార్థులు నీహారిక, ఏ.గౌతిక ద్వితీయ బహుమతి రూ.4 వేలు, కొత్తపట్నం హైస్కూల్ విద్యార్థులు కోడూరి భూలక్ష్మి, పుటికే ధరణి తృతీయ బహుమతి రూ.3 వేలు మేనేజర్ సురేష్, హెచ్‌ఎం పాలేటి సుబ్బారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఆర్థిక అక్ష్యరాస్యత, క్రమశిక్షణ నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచి బ్యాంక్ లావాదేవీలు నడుపుకుంటే భవిష్యత్‌లో మీకు అండగా ఉంటుందన్నారు. ఉన్నత చదువులు చదవుకుని స్థిరపడటానికి బ్యాంక్ సహాయ, సహకారం అందిస్తురదన్నారు. ఇప్పటికే విద్యార్థులకు 600 జీరో ఖాతా అకౌంట్‌లు ఇచ్చామన్నారు. అందులో పొదుపు చేసుకోవాలని సూచించారు. ఖాతా దారులు బ్యాంక్‌లకు రాకుండ టోల్‌ఫ్రీ నెంబర్ 18001030 ఫోన్ చేస్తే మీ ఖాతాలో ఎంత నగదు ఉన్నాయి, లోను ఎంత చెల్లించాలి, క్రెడిక్ కార్డు లావాదేవీల వివరాలు 24 గంటల్లో ఎప్పుడు ఫోన్ చేసిన పూర్తి సమాచారం తెలుసుకోవచ్చున్నారు. కెనరా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ రమేష్‌బాబు, బ్యాంక్ మిత్ర పురిణి నాంచార్లు, ఉపాధ్యాయులు జిలాని, శకుంతల, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బమ్మ సేవలు అభినందనీయం



సుబ్బమ్మ టీచర్‌ను సత్కరిస్తున్న ఎంఈఓలు సనత్‌కుమార్, వెంకారెడ్డి



నూతన ఎంఈఓను అభినందిస్తున్న యూటీఎఫ్ టీచర్స్

చీమకుర్తి: విద్యార్థులకు కనగాల సుబ్బమ్మ అందిస్తున్న సేవలు అభినందనీయమని సంతనూతలపాడు ఎంఈఓలు సనత్‌కుమార్, డి.వెంకారెడ్డి ప్రశంసించారు. సంతనూతలపాడు (బీఎస్) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గత 8 సంవత్సరాలుగా పనిచేసి బదిలీపై మైనంపాడు వెళ్ళిన కనగాల సుబ్బమ్మను ఎంఈఓలు గురువారం శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బమ్మ పనిచేసిన 8 సంవత్సరాల్లో పలువురు విద్యార్థులకు నవోదయ సీట్లు వచ్చే విధంగా బోధన చేసి సీట్లు సాధించారని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శైలజ పాల్గొన్నారు.

నూతన ఎంఈఓలకు అభినందనలు

సంతనూతలపాడు ఎంఈఓ–2గా బాధ్యతలను స్వీకరించిన డి.వెంకారెడ్డిని స్థానిక యూటీఎఫ్ టీచర్‌లు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీలలో డి.వెంకారెడ్డి సంతనూతలపాడు ఎంఈఓ–2గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.వెంకటేశ్వరరెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, సుబ్బారావు, చెన్నయ్య పాల్గొన్నారు.

గుమ్మం ముందే సమస్య పరిష్కారం



కొత్తపట్నం: జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న అర్జున్‌రెడ్డి

కొత్తపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి ఇంటి వద్దకే పరిపాలన అందించడానికి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టిందని డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం మూడో రోజు వలంటీర్లకు ప్రజా ప్రతినిధులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయం సబ్బంది గ్రామాల్లో ప్రవేశించి ప్రతి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, సర్పంచ్ విశనాథపల్లి ఆనంద్‌రావు, శ్రావణి, ఎంపీటీసీ సభ్యుడు పిన్ని నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి సునీత, అల్లెయ్య, వీఆర్వో చంద్రశేఖర్, వీఆర్వో సురేష్, వినోద్, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

'ఆణిముత్యాల'కు నగదు అందజేత



నగదును పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం కోటమ్మ, రాజుగోపాల్‌రెడ్డి

ఆలూరు (కొత్తపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న ఆణిముత్యాలు పథకం ఎంతో విద్యార్థులకు ఉపయోగ పడింది. అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆణిముత్యాల పథకం అందజేశారు. వారు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. అందులో భాగంగా ఆలూరు హైస్కూల్‌లో ఆణిముత్యాల పంపిణీ కార్యక్రమం గురువారం హెచ్‌ఎం జి.కోటమ్మ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పదో తరగతితో అత్యధిక మార్కులు సాధించిన జి.పావని (519) రూ.3 వేలు, కె.భాను (483) రూ.2 వేలు, సీహెచ్ హర్షిణి (477) రూ. 1000 నగదు, ప్రశంస పత్రాలను అందించారు. అనంతరం ఆలూరు నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు సీహెచ్ మురళి, కె.శకుంతల, ఎన్.లలిత, కె.శ్రీనివాసరావులను శాలువాతో సన్మానించారు. ఎంపీటీసీ సభ్యురాలు దొడ్ల స్వాతి భర్త రాజుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైద్యసిబ్బంది

మద్దిపాడు: మండలంలోని గొర్రెలు మేకల పెంపకం దారులు నట్టల నివారణ మందు తమ జీవాలకు వేయించుకుని వాటిని వృద్ధి చేసుకోవాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. గురువారం ఇనమనమెళ్లూరు పశువైద్యశాలలో జూనియర్ ఆఫీసర్ కోటేశ్వరరావు నట్టల నివారణ మందు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి చేతుల మీదుగా అందించారు. రైతులకు సబ్సిడీపై జొన్నలు పంపిణీ చేశారు. ఇనమనమెళ్లూరులో 1050 గొర్రెలకు, 60 మేకలకు, నట్టల నివారణ మందు తాపించినట్లు తెలిపారు.

జాతీయ విపత్తులపై దివ్యాంగులకు అవగాహన



మాట్లాడుతున్న బిటన్ సింగ్, వైవీ రెడ్డి

చీమకుర్తి: ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం చీమకుర్తిలోని బదిరుల పాఠశాలలోని దివ్యాంగులకు జాతీయ విపత్తులపై అవగాహన కల్పించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బెటాలియన్ కమాండర్ బిటన్ సింగ్, ఏఎస్సై వైవీ రెడ్డి, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి అర్చన ఆధ్వర్యంలో మాట్లాడారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటన, గుజరాత్ భూకంపం సమయాల్లో జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం వంటి అంశాలపై వివరించారు. ప్రమాదాల సమయంలో తమను తాము కాపాడుకోవడం, ఇతరులను కాపాడటం వంటి విధానాలపై వివరించారు. 15 మంది సభ్యులు, తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు, కరస్పాండెంట్ ఆంజనేయులరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ రక్షణ కోసం ధర్నా రేపు



ధర్నా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం, ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 24న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు తెలిపారు. గురువారం కరపత్రాన్ని విడుదల చేశారు. దేశ సంపదను బడాబాబులకు కట్టబెడుతున్న మోదీ ప్రభుత్వం నిరుపేదల ఉపాధి దెబ్బతీస్తోందని విమర్శించారు. కూలీలకు వ్యతిరేకంగా చట్టంలో మార్పు తెస్తున్న కేంద్ర ప్రభుత్వం, బడ్జెట్ తగ్గిస్తోందన్నారు. గత 7 వారాలుగా కూలీలు చేసిన పనికి వేతనాలు ఇవ్వడం లేదని, దీంతో రెక్కల కష్టం మీద ఆధారపడి బతుకుతున్న కష్టజీవులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కె.వెంకటేశ్వర్లు, జి.రవికుమార్ పాల్గొన్నారు.

వలంటీర్లకు సేవా పురస్కారాలు



వలంటీర్లను సత్కరిస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మంగమూరు సచివాలయ పరిధిలోని 20 మంది వలంటీర్లకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి చేతుల మీదుగా సేవా మిత్ర పురస్కారాలను గురువారం పంపిణీ చేశారు. శాలువాలు కప్పి సత్కరించారు. గత ఏడాది నుంచి వలంటీర్‌లు చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ప్రతి ఏటా అందిస్తున్న సేవా పురస్కారాల్లో భాగంగా ఈ ఏడాది కూడా సేవా మిత్ర అవార్డులను అందించారు. జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పాలపర్తి వెంకటరెడ్డి, అల్లీ సాహెబ్, దమ్మాల శ్రీను, వీరభద్రయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాలకు 10 మంది ఎంపిక

కొత్తపట్నం: మడనూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గమళ్ళపాలెం ఎంపీపీ స్కూల్‌లో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థులు గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలకు ఎంపికయ్యారు. గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. 12 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాయగా 10 మందికి సీట్లు సాధించారన్నారు. ఎంఈవో బి.అజయ్‌బాబు, ఎంఈవో–2 పద్మావతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం మారుతి జ్యోతి, కుమారిలను సత్కరించి అభినందించారు. గోలి శివయ్య, జాలరామయ్య, విజయ్‌కుమార్, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, శివరాజు, శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షలో స్కిల్ టెస్ట్ వాయిదా

ఒంగోలు: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఈ నెల 23న సమగ్రశిక్ష కార్యాలయంలో నిర్వహించాల్సిన స్కిల్ టెస్టును వాయిదా వేసినట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. స్కిల్ టెస్టును మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి

మద్దిపాడు: పశు సంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పాడి రైతులు అందిపుచ్చుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబీరాణి అన్నారు. గురువారం సాయంత్రం ఆమె మండలంలోని ఇనమనమెళ్లూరులో అమూల్ పాల సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. సబ్సిడీపై జొన్నలు తమ శాఖ ద్వారా ఇస్తున్నట్లు తెలిపారు. పశువులకు బీమా కూడా చేయిస్తున్నమని, పశునష్టం సంభవిస్తే ఇన్సూరెన్స్ ఇస్తున్నట్లు తెలిపారు. జూనియర్ వెటర్నరీ అధికారి కోటేశ్వరరావు, పశుపోషకులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌కు ఘన నివాళి

మద్దిపాడు: మండలంలోని కీర్తిపాడు పంచాయతీ ఉప సర్పంచ్ మోంద్రు శ్రీనివాసరావుకు మండల పార్టీ నాయకులు పలువురు నివాళులర్పించారు. మోంద్రు శ్రీనివాసరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఈక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి మాట్లాడుతూ శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటన్నారు. వారి కుంటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, పిట్టల ఆంజనేయులు, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, గ్రామ పార్టీ నాయకులు తిప్పారెడ్డి కోటిరెడ్డి పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన ఆరోగ్యం



ఉలిచిలో మాట్లాడుతున్న ఏవో కిషోర్‌బాబు

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరమైనదని మండల వ్యవసాయశాఖ అధికారి కిషోర్ బాబు తెలిపారు. రూరల్‌లోని ఉలిచి గ్రామంలో రైతు సాధికారిక సంస్థ ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్యకర్తలతో మాట్లాడారు. సీజన్ మారుతున్న నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తీసుకోవాల్సిన చర్యలు విత్తనాల సేకరణ, విత్తన గుళికల ఏర్పాటు తదితర అంశాలను పరిగణంలోకి తీసుకుని సమాయత్తం కావాల్సిందిగా కోరారు. సిబ్బంది రాధా శింగమనేని, పద్మావతి, వీఏఏ బాలకృష్ణ, ఐసీఆర్‌పీలు హాజరయ్యారు.

జీజీహెచ్‌లో లాగోప్తాల్మోస్ ఆపరేషన్



వైద్య బృందాన్ని అభినందిస్తున్న భగవాన్ నాయక్

ఒంగోలు అర్బన్: జీజీహెచ్‌లో లాగోప్తాల్మోస్ (కనురెప్పలు మూసూకోలేక పోవడం, మూసుకు పోవడం) సమస్యకు ఆసుపత్రి ప్లాస్టిక్ సర్జరీ విభాగం విజయవంతంగా ఆపరేషన్ చేశారు. తాళ్లూరు మండలం బొద్దికూరపాడుకు చెందిన మందా ఆదెయ్య గత ఐదేళ్లుగా లెప్రసీ వ్యాధికి చికిత్స పొందుతున్నాడు. దీని ప్రభావంతో ఆదెయ్యకు కనురెప్పలు పూర్తిగా మూసుకోలేని సమస్య వచ్చింది. డాక్టర్ స్ఫూర్తి ఆధ్వర్యంలో విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించి గురువారం డిశ్చార్జ్ చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్ ఆదెయ్య ఆరోగ్య పరిస్థితిలు అడిగి తెలుసుకుని వైద్య బృందాన్ని అభినందించారు.

ముగిసిన ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ



ఎన్‌సీసీ శిక్షణ ముగింపులో క్యాడెట్లు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్‌సీసీ క్యాడెట్ శిక్షణ గురువారంతో ముగిసింది. ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు, కందుకూరు డివిజన్ల నుంచి 374 మంది క్యాడెట్‌లు పాల్గొన్నారు. ఫైరింగ్, డ్రిల్, మ్యాప్ రీడింగ్, జడ్జింగ్ డిస్టెన్స్ /ఫీల్డ్ సిగ్నల్స్, టెంట్ పిచ్చింగ్, ఫ్లాగ్ ఏరియా బ్రీఫింగ్, హెల్త్, హైజిన్ మొదలైనవి సబ్జెక్టుల్లో శిక్షణ ఇచ్చారు. ఇంటర్ డివిజన్ కాంపిటీషన్‌లో ఒంగోలు డివిజన్ క్యాడెట్లు విజేతలుగా నిలిచారు. క్యాంపు విజయవంతంగా ముగిసేందుకు సహకరించిన పేస్ కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్‌కు 34వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అజయ్ కుటిన్హా కృతజ్ఞతలు తెలిపారు.

26న వంకాయలపాటి వర్ధంతి సభ

ఒంగోలు టౌన్: ప్రముఖ సాహితీ వేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఉత్తమ ఉపాధ్యాయుడు డాక్టర్ వంకాయలపాటి రామకృష్ణ వర్ధంతి సభను ఈనెల 26 నిర్వహించనున్నట్లు తెలుగు లోగిలి అధ్యక్షులు డా.నూనె అంకమరావు, నరసం రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఒంగోలు హౌసింగ్ బోర్డు కాలనీలోని మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో జరుగుతుందన్నారు.